11, 12 తేదీల్లో కలెక్టరేట్ ముట్టడి

జూబ్లీహిల్స్, జూలై 8: విద్యారంగ సమస్యల పరిష్కారానికి స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్ఎఫ్ఐ ఆలిండియా కమిటీ పిలుపులో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లను ముట్టడిస్తున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బండ్లగూడ, జూలై 8: ప్రభుత్వ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. గండిపేట మండల పరిధిలోని కిస్మత్‌పూర్‌లో సర్వే నంబర్ 132, హిమయాత్‌సాగర్ సర్వే నంబర్ 37లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను సోమవారం ఉదయం తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ సిబ్బందితో కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలను చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాలాల పూడికతీత పనులు చేపట్టాలి

రహ్మత్‌నగర్‌లో నాలా పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్, జూలై 8: వర్షాలతో నాలాలు ఉప్పొంగకుండా పూడికతీత పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధికారులను కోరారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లో సోమవారం పర్యటించి నాలాల రిటైనింగ్ వాల్స్ పునర్నిర్మాణ పనులు, రోడ్డు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ శ్రీరాములు, ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వణిధర్ పాల్గొన్నారు.

భావితరాల బంగారు భవిష్యత్తు కోసం..

● వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్

మణికొండ, జూలై 8: భావితరాల బంగారు భవిష్యత్తుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కల పెంపకం ఒక్కటే మార్గమని ఆయన పేర్కొన్నారు. మణికొండ మున్సిపాలిటీ 12వ వార్డులో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ మొక్కలు నాటి వదిలివేయకుండా వాటి ఎదుగుదల బాధ్యతను తీసుకోవాలన్నారు. ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలు, ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. వాటికి ప్రతిరోజూ నీరుపోసి ఎదిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దేశంలోని పలు నగరాల్లో పర్యావరణం పూర్తిగా కలుషితం అవుతున్న తరుణంలో ప్రాణవాయువును పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కల పెంపకం ఎంతో ముఖ్యమని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రజలు ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్వేతాకిరణ్‌కుమార్, పురుషోత్తం, రామకృష్ణారెడ్డి, శైలజ, కావ్యశ్రీరాములు, నవీన్, కోఆప్షన్ సభ్యులు అహ్మద్ షాఖాన్, లక్ష్మి, సిద్ధప్ప, కమిషనర్ ప్రదీప్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, యాలాల నరేశ్, ముత్యాలు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, ప్రవీణ్‌కుమార్, మహేశ్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణికొండ 12వ వార్డులో మొక్కలు నాటుతున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు

అత్తాపూర్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

మొక్కలు నాటి సంరక్షించాలి..

అత్తాపూర్, జూలై 8: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు, పర్యావరణ కాలుష్యం తగ్గించేందుకు చెట్లు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి, నాటిన మొక్కలను రక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రవికుమార్, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత, నాయకులు వనం శ్రీరామ్‌రెడ్డి, శ్రీను, చిన్న, రాజశేఖర్, సుధాకర్, జంగయ్య, మహేశ్, చెన్నయ్య, అజయ్, నరేందర్‌రావు, సదా, లక్ష్మణ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలకు నిదర్శనం నిస్సార్

హిమాయత్‌నగర్, జూలై 8: దశాబ్దాలుగా తన పాటలతో ప్రజా ఉద్యమాలకు ఊపునిచ్చిన గొప్ప కవి, గాయకుడు ఎండీ నిస్సార్ అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కొనియాడారు. కవి నిస్సార్ 4వ వర్ధంతి సందర్భంగా సోమవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో నిస్సార్ తన గానంతో ప్రజల్లో చైతన్యం కలిగించి ఉద్యమం వైపు మళ్లించడంతో కీలకపాత్ర వహించారని గుర్తుచేశారు. సమాజంలో పేరుకుపోయిన దోపిడీ, అవినీతి అంతం కావాలని అనేక ఉద్యమాలు చేయడంతో పాటు పాటలతో ప్రజల్లో ఉత్తేజం నింపారని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరాస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, సమన్వయకర్త కేవీఎల్, నాయకులు జి.చంద్రమోహన్‌గౌడ్, అనిల్‌కుమార్, రాజ్‌కుమార్, జె.కుమార్, మణికంఠ రెడ్డి, లక్ష్మణ్, రాజమౌళి పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మిడ్ డే మీల్స్‌ను కార్మికులే నిర్వహించాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 8: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డికి మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, కార్మికులు కలిసి విజ్ఞప్తి చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం అక్షయ పాత్రకు మిడ్ డే మీల్స్ బాధ్యత అప్పగించడంతో 22 ఏండ్ల నుంచి పని చేస్తున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

గతంలో శేరిలింగంపల్లి, మొయినాబాద్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాలను అక్షయపాత్రకు అప్పగించారని అన్నారు. శంషాబాద్ మండలాన్ని అక్షయపాత్రకు ఇవ్వొద్దన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, కార్మికులు

పనుల్లో నాణ్యత పాటించాలి

పిరంచెరువులో డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన బండ్లగూడ జాగీర్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 8: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ వార్డులో సోమవారం మేయర్ లతాప్రేమ్ గౌడ్ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డితో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అసియా ఖాజ, అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

చేనేత కళాకారులను ప్రోత్సహించాలి

వెంగళరావునగర్, జూలై 8: శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను యూట్యూబర్, ఫన్ బకెట్ ఫేమ్ నాగభార్గవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో పట్టు, హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. నేటికి వీటికి వన్నె తగ్గలేదన్నారు. నేటి తరం యువత కూడా హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. చేనేత వస్త్రాలను మరింత ఆదరించాలన్నారు. నిర్వాహకుడు జయేశ్ గుప్తా మాట్లాడుతూ ఈనెల 14 వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

ఎస్సై ఆత్మహత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

హిమాయత్‌నగర్, జూలై 8: పోలీస్‌శాఖలో కుల వివక్ష వేధింపులతోనే దళిత ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అశ్వరావుపేట ఎస్సై శ్రీనివాస్ 25 రోజుల కిందటే వివక్ష వేధింపులపై ఆ జిల్లా ఎస్పీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. దీంతో మనోవేదన చెంది ఎస్సై శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షలు తక్షణ పరిహారం అందించి, ఈ ఘటనకు బాధ్యులైన సీఐ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుళ్లను సర్వీస్ నుంచి డిస్మిస్ చేసి, పోలీస్ శాఖలో కులవివక్షతో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వనమహోత్సవానికి స్థల పరిశీలన

స్థలాన్ని పరిశీలిస్తున్న నార్సింగ్ మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ, అధికారులు

మణికొండ, జూలై 8: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నార్సింగి, కోకాపేట్, మంచిరేవుల వార్డుల్లో కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డీఈ నర్సింహరాజుతో కలిసి మొక్కలు నాటడానికి స్థలాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ, జూలై 8: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బండ్లగూడ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి 'ప్రివెంటేషన్ ఈస్ బెటర్ దెన్ క్యూర్' అనే కార్యక్రమాన్ని మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు విషజ్వరాల బారినపడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. డెంగ్యూ, మలేరియా రాకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు వృద్ధి చెందవని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, మెడికల్ అధికారులు డాక్టర్ పద్మ, శ్రీనివాస్, విమల, డాక్టర్ షర్బుద్దీన్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్ పంపిణీ

పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మేయర్ లతాప్రేమ్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దర్గాఖలీజ్ ఖాన్ ప్రభుత్వ పాఠశాలలో సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో విద్యార్థులకు బ్యాగులు, నోట్‌పుస్తకాలను ఆమె డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అస్లాబిన్ అబ్దుల్లాతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ఉపాధ్యాయులు వారిని తీర్చిదిద్దాలన్నారు. చదువులో ముందున్న వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

డిప్యూటీ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కిసాన్ మోర్చా నాయకులు

శంషాబాద్ రూరల్, జూలై 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీతో పాటు ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రైతుబంధు ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా సమస్యలు మరిచిపోయి కేవలం పార్టీ ఫిరాయింపులకే సమయం ఇస్తున్నారని విమర్శించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యాక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు దేవేందర్, విజయభాస్కర్‌రెడ్డి, అమరేందర్, ధన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా.. తెలంగాణ బోనాల జాతర

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త అన్నారు. భారత్ ఆర్ట్స్ అకాడమీ , ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాల కార్యక్రమం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోలేటి దామోదర్‌గుప్త విచ్చేసి బోనాల జాతర ఉత్సవాన్ని ప్రారంభించారు. సభకు ముందు పలువురు విద్యార్థినులు బోనాలు, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలిచ్చి వీక్షకులను అలరించారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు లయన్ కె.వి. రమణారావు, నాట్యగురువు ప్రసన్నరాణి, లలితరావు, టీవీ సీరియల్ హీరో రాగిణి, కరాటే కల్యాణిను భారత్ ఆర్ట్స్ అకాడమీ సత్కరించింది.

- రవీంద్రభారతి

వైద్యుల సేవలు మరువలేనివి

సుల్తాన్‌బజార్, జూలై 8 : జియాగూడకు చెందిన పీడియాట్రీషన్ డాక్టర్ వినయ్‌కుమార్‌ను వైద్యరత్న అవార్డు వరించింది. రవీంద్రభారతిలో మదర్ ఫౌండేషన్ నిర్వహించిన జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి,బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ఏపీ ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ రుద్రరాజు పద్మరాజుతో కలిసి డాక్టర్ వినయ్‌కుమార్, పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రణీత దంపతులకు వైద్యరత్న అవార్డును ప్రదానం చేసి సన్మానించారు. కార్యక్రమంలో మదర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్కెనపల్లి మల్లికార్జున్‌రావు, కార్యనిర్వాహణ కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, ఆర్. సాయికుమార్, బీఆర్ఎస్ నాయకుడు నర్సింహులు, ఎం. విజయలక్ష్మి, ధృవిక పాల్గొన్నారు.

మీ ఇంటికి స్వచ్ఛ ఆటో వస్తుందా..?

● జూబ్లీహిల్స్‌లో జెడ్సీ అనురాగ్ జయంతి ఆరా

జూబ్లీహిల్స్, జూలై 8: పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలని, రోడ్లపై చెత్త వేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సూచించారు. జీహెచ్ఎంసీ 18వ సర్కిల్ జూబ్లీహిల్స్, ఏబీఎన్, దీన్‌దయాల్‌నగర్, బాల్‌రెడ్డినగర్, దుర్గాభవాని నగర్లలో సోమవారం అధికారులతో కలిసి పర్యటించారు. జెడ్సీ స్వయంగా స్వచ్ఛ ఆటో మీ ఇంటికి వస్తుందా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జెడ్సీ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటో ప్రతి ఇంటికి విధిగా వెళ్లి చెత్త సేకరించాలని అన్నారు. తద్వారా రోడ్లపై చెత్త చేరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త చేరకుండా గార్బేజ్ వనరబుల్ పాయింట్లను పూర్తిగా తొలగించాలన్నారు. ఇంటి వద్దకు ఆటో రాకపోతే ఫిర్యాదు చేయాలని, అనివార్య కారణాలతో వెళ్లకపోతే అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని, మొదటిసారిగా జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, ఏఎంఓహెచ్ డాక్టర్ కె.రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

కాటేదాన్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక విధానాలను ఎండగట్టేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ కోరారు. సోమవారం కాటేదాన్‌లో జూలై 10న కార్మికుల కోరికల దినోత్సవం సందర్భంగా కోశాధికారి భాస్కర్, ప్రవీణ్‌తో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10న కాటేదాన్ పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ర్యాలీ, ధర్నాలను విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేసి దేశ సంపదను ప్రైవేటు, కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పాలని చూస్తున్నదని ఆరోపించారు. ఎంపీలు లోక్‌సభలో ప్రమాణస్వీకారం చేయకముందే కార్పొరేట్ శక్తుల లాభాలు పొడిగించిందన్నారు. కార్మికుల ఈపీఎఫ్, బకాయి చెల్లింపులో యాజమాన్యాలకు విధించే జరిమానాలను తగ్గించిందన్నారు. ఇలా అనేక రంగాల కార్మికుల అందరికి కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పరిశ్రమల్లో కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో జాంగీర్, మల్లేశ్, లక్ష్మణ్, దత్తు, శశికాంత్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కర్ణాటక బ్యాంకు, బజాజ్ అలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని బంజారాహిల్స్‌లోని ఉషా ఎన్‌క్లేవ్‌లో ఉషా ఎన్‌క్లేవ్ అధ్యక్షుడు ప్రారంభించారు. అపార్ట్‌మెంట్ వాసులకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కర్ణాటక బ్యాంకు చీఫ్ మేనేజర్ బసిరెడ్డి, సీనియర్ మేనేజర్ రామ్మోహన్ రెడ్డి, బజాజ్ అలయన్స్ ప్రతినిధులు శ్రీకాంత్, దేవీప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేత హుస్సేన్‌ను విడుదల చేయాలి

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మాట్లాడుతున్న లక్ష్మణ్

హిమాయత్‌నగర్, జూలై 8: సింగరేణి కార్మిక నేత, రచయిత మహ్మద్ హుస్సేన్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తక్షణమే ఆయనను విడుదల చేయాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా, జమ్మికుంటలో ఉన్న సొంత ఇంటిలో 10 ఏండ్లుగా సాధారణ జీవితం గడుపుతున్న హుస్సేన్‌ను మఫ్టీలో వచ్చిన పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని ఒక పక్క ప్రభుత్వం ప్రకటిస్తూనే మరోపక్క నియంతృత్వ పాలన చేస్తుందని ఆరోపించారు. హుస్సేన్ ప్రాణాలకు ఏదైనా హాని జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి హుస్సేన్ బేషరతుగా విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రాము, రామ్మోహన్, భవాని తదితరులు పాల్గొన్నారు.

టూరిజం చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి సత్కారం

టూరిజం చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

హిమాయత్‌నగర్, జూలై 8: తెలంగాణ టూరిజం కార్పొరేషన్ చైర్మన్‌గా నూతనంగా పటేల్ రమేశ్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హిమాయత్‌నగర్‌లోని టూరిజం ప్రధాన కార్యాలయంలో రమేశ్‌రెడ్డిని తెలంగాణ టూరిజం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం సంస్థలో 25 ఏండ్లుగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేసేందుకు కృషి చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. చైర్మన్ రమేశ్‌రెడ్డి సానుకూలంగా స్పందించి అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చినట్లు రాజమౌళి తెలిపారు. నాయకులు గోపి, జ్యోతి, రచన, రమేశ్, ఇక్బాల్, చంద్రమౌళి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ, జూలై 8: కాళీమందిర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారి ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు భవానినగర్, లిబ్‌డమ్ విల్లాస్